ఆశాల సమస్యలు పరిష్కరించాలి

- పారితోషికాల పేరుతో అదనపు పని
- వలంటీర్ కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు జయలక్ష్మి
- రాష్ట్ర వ్యాప్తంగా మానవహారాల ఏర్పాటు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆశా వర్కర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, లేని యెడల సమ్మెను మరింత ఉధృతం చేస్తామని తెలంగాణ వలంటీర్ కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు పి.జయలక్ష్మి అన్నారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 28 వేల మంది ఆశా వర్కర్లు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమ్మెలో భాగంగా శనివారం రాష్ట్ర వ్యాప్తంగా మానవహారాలు నిర్వహించగా.. తెలంగాణ వలంటీర్ కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ కమిటీ ఆధ్వర్యంలో ఆర్‌టిసి క్రాస్‌రోడ్‌లో వినూత్న రీతిలో నిరసన తెలిపారు. 'కెసిఆర్ గారూ ఆశావర్కర్ల ఆకలి గోస వినండి! ఫిక్స్‌డ్ వేతనం రూ.18000 పెంచండి' అంటూ ప్లేట్లను మోగిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పి.జయలక్ష్మి మాట్లాడుతూ.. ఆశాలకు పారితోషికాల పేరుతో కేవలం రూ.9750 ఇస్తూ పని భారం మోపుతూ.. దేశంలోనే మూడు సార్లు పారితోషికాలు పెంచామని పాలకులు గొప్పలు చెబుతున్నారని విమర్శించారు. టార్గెట్లు, పని ఒత్తిడి వల్ల ఆశాలు చిన్న వయస్సులోనే బిపి, షుగర్, థైరాయిడ్, గుండెపోటు వంటి రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈఎస్ఐ, పిఎఫ్, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఆరు నెలల పిఆర్‌సి బకాయిలు, 18 నెలల కరోనా రిస్క్ అలవెన్స్ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆశాలకు రిటైర్మెంట్ బెనిఫిట్ రూ. ఐదు లక్షలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం వెంటనే యూనియన్‌తో చర్చలు జరిపి సమస్యలు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో సిఐటియు గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.వెంకటేష్, ఐద్వా నగర కార్యదర్శి నాగలక్ష్మి, సిఐటియు నగర సహాయ కార్యదర్శులు మహేందర్, ఎం.సత్యనారాయణ, నాయకులు పి.మల్లేష్, ఆశా వర్కర్స్ యూనియన్ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు యాదమ్మ, ఎం.అనిత కోశాధికారి రాణి పాల్గొన్నారు.

మానవహారంగా ఏర్పడి నిరసన తెలుపుతున్న హెల్త్ వర్కర్లు

రంగారెడ్డి జిల్లా తలకొండపల్లిలో ఆశాలు మానవహారంగా ఏర్పడ్డారు. రాజేంద్రనగర్‌లోని హైదర్‌గూడ చౌరస్తాలో ఆందోళన చేపట్టారు. వికారాబాద్ జిల్లాలో పరిగిలో ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలిపారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు రాజేందర్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌక్‌లో మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. నిర్మల్ ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట జాతీయ రహదారిపై మానవహారం నిర్వహించారు. ఆదిలాబాద్ జిల్లా దిలావర్‌పూర్, నర్సాపూర్(జి) మండలాల్లో ఆశా కార్యకర్తలు నిర్మల్-భైంసా జాతీయ రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. లోకేశ్వరంలో భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి మానవహారం నిర్వహించారు. కరీంనగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట కండ్లకు నల్ల గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యలను నిరసిస్తూ చెవిలో పూలు పెట్టుకొని నిరసన తెలిపారు. ఖమ్మం జిల్లా ఖమ్మం రూరల్ మండలం పెద్దతండలో ప్రధాన రహదారిపై ఆశాలు మానవహారం చేపట్టారు. మధిరలో భారీ ర్యాలీ చేపట్టి నిరసన తెలిపారు. మధిరలో ఎమ్మెల్యే భట్టి విక్రమార్క సంఘీభావం తెలిపారు. భట్టికి ఆశాలు వినతి పత్రం అందజేశారు.

సభలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు

ఆయిల్ పామ్ సాగుతో లాభాలు

- చంద్రబాబు అరెస్టు దురదృష్టకరం : హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిజెపి, కాంగ్రెస్ పాలకులకు దూరదృష్టి లేకపోవడంతోనే ప్రతి సంవత్సరం రూ.1.56 కోట్ల విలువైన మంచి నూనెను దిగుమతి చేసుకుంటున్నామని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మేట గ్రామంలో రూ.300 కోట్లతో నిర్మించనున్న ఆయిల్‌పామ్ కర్మాగారానికి శనివారం ఆయన భూమిపూజ చేశారు. అనంతరం మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. దేశంలో ఒక వ్యక్తి సంవత్సరానికి 19 కిలోల నూనె తాగుతున్నారని, అందులో 40 శాతం మనదేశంలో ఉత్పత్తి అయితే, 60 శాతం ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామని తెలిపారు. అందుకు గత పాలకులకు ముందుచూపు లేకపోవడమే కారణమన్నారు. ఆయిల్ పామ్ సాగును పెంచి నూనెల దిగుమతిని తగ్గించుకోవాలన్నారు. అందుకే ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తున్నామని, సాగు విస్తీర్ణం పెంచుతున్నామని చెప్పారు. నేడు ఆంధ్రాలో వందల ఎకరాల భూములు అమ్మితే తెలంగాణలో ఎకరా భూమి వస్తుందని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు ఒక మంచి మాట అన్నారని గుర్తు చేశారు. ఆ వయసులో ఆయనను అరెస్టు చేయడం దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎమ్మెల్యే సతీష్, ఎఫ్‌డిసి చైర్మన్ ప్రతాపరెడ్డి, ఆయిల్ ఫెడ్ కమిషనర్ హనుమంతరావు, ఎండి సురేందర్ రెడ్డి, చైర్మెన్ రామకృష్ణారెడ్డి, కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, జడ్‌పి చైర్‌పర్సన్ రోజా శర్మ తదితరులు పాల్గొన్నారు.

'పిల్లల గుండె ఆపరేషన్లు' నిరంతర ప్రక్రియ

- నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి భీరప్ప

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని పంజాగుట్ట నిమ్స్ ఆస్పత్రిలో గుండె చికిత్సల క్యాంపు నేటితో ముగించడం లేదని, చిన్న పిల్లలకు గుండె ఆపరేషన్లు నిరంతరం జరుగుతూనే ఉంటాయని ఆస్పత్రి డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి భీరప్ప వెల్లడించారు. బ్రిటన్ వైద్యుల సహకారంతో ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన చిన్నారుల గుండె ఆపరేషన్లు విజయవంతమైన సందర్భంగా శనివారం నిమ్స్ లర్నింగ్ సెంటర్‌లో యుకె డాక్టర్లకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీరప్ప మాట్లాడుతూ.. ఈ వారంలో కనీసం 500 మంది చిన్నారులకు స్క్రీనింగ్ చేసినట్టు తెలిపారు. చిన్నారుల్లో సమస్య తీవ్రతను గుర్తించి నిమ్స్‌లోని స్పెషాలిటీ బ్లాక్‌లో ప్రతి గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రూం నెంబర్ 10లో ప్రత్యేకంగా కార్డియాలజీ ఒపి కన్సల్టేషన్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. డాక్టర్ అంబిరిస్ రావు మాట్లాడుతూ.. ఈ దఫా 15 ఆపరేషన్లను విజయవంతంగా పూర్తి చేశామని, మిగతా వారికి కూడా ఆపరేషన్లు నిరంతరంగా కొనసాగిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ గోపాల్, డాక్టర్ రమణ, వైద్యుల బృందం, చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

- సిఎస్ శాంతి కుమారికి డిజెహెచ్‌ఎస్ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలు కేటాయించాలని కోరుతూ డెక్కన్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ ప్రతినిధి బృందం శనివారం సచివాలయంలో సిఎస్ శాంతికుమారిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఎస్ స్పందిస్తూ జర్నలిస్టుల ఇళ్ల కోసం తమ వంతు కృషి చేస్తామంటూ హామీ ఇచ్చారు. సొసైటీ అధ్యక్షులు బొల్లోజు రవి, ఉపాధ్యక్షులు ఎం శ్రీనివాస్, ట్రెజరర్ సిహెచ్ అయ్యప్ప, డైరెక్టర్లు దండా రామకృష్ణ, డి.కుమార్, సభ్యులు శ్రీలత తదితరులు సిఎస్‌ను కలిసిన వారిలో ఉన్నారు. "డిజెహెచ్‌ఎస్' సభ్యులకు హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఇళ్ల స్థలాల కేటాయించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఎన్నో రకాల సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తూ రాష్ట్రాన్ని ప్రగతిపథంలో విజయవంతంగా ముందుకెళ్తుందనీ, ఈ క్రమంలో జర్నలిస్టులకు కూడా ఇండ్లు కేటాయించాలని కోరారు.

2న తంగిరాల అవార్డు ప్రదానోత్సవ సభ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తంగిరాల మెమోరియయల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మక తంగిరాల కృష్ణ ప్రసాద్ 24వ స్మారక రంగస్థల పురస్కారం డాక్టర్ ముడుంబై పురుషోత్తమాచార్యకు ప్రదానం చేయనున్నారు. ఈ మేరకు తంగిరాల ట్రస్ట్ బాధ్యులు గోపికృష్ణ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అక్టోబర్ 2న ఉదయం 10 గంటలకు నల్లగొండలోని ఎంవిఎన్ భవన్‌లో సభ నిర్వహించనున్నారు. ఈ సభకు ముఖ్య అతిథిగా నవ తెలంగాణ ఫ్యూచర్స్ ఎడిటర్ కె.ఆనందాచారి, కళారత్న చింతా వెంకటేశ్వర్లు, హైదరాబాద్ బుక్ ఫెయిర్ ఉపాధ్యక్షులు కె.చంద్రమోహన్, ప్రముఖ కథా రచయిత పుప్పాల కృష్ణమూర్తి, తెలంగాణ సాహితీ కోశాధికారి ఎ.మోహన్ కృష్ణ, కవులు సాగర్ల సత్తెయ్య, బి.గోపీకృష్ణ, తంగిరాల ట్రస్ట్ అధ్యక్షులు తంగిరాల చక్రవర్తి తదితరులు పాల్గొననున్నారు. కవులు, రచయితలు, సంగీతకారులు హాజరై తెలంగాణకు గర్వకారణంగా నిలిచి కేంద్ర ప్రభుత్వ జాతీయ పురస్కారం పొందిన పురుషోత్తమాచార్యను అభినందించనున్నారు.

వేడుకగా ప్రైడ్ ఆఫ్ నేషన్ అవార్డ్స్ ప్రదానం

హైదరాబాద్ : వివిధ రంగాలకు చెందిన అసాధారణ వ్యక్తులకు "ప్రైడ్ ఆఫ్ నేషన్ అవార్డ్ 2023-సదరన్ ఇండియా" అవార్డులను ప్రదానం చేశారు. ఆసియా టుడే రీసెర్చ్ అండ్ మీడియా నిర్వహించిన ఈ కార్యక్రమంలో గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ పాల్గొని అవార్డులను బహూకరించారు. కళలు, వినోదం, విద్య, ఆరోగ్య సంరక్షణ, వ్యాపారం, సామాజిక సేవా రంగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారిని గుర్తించి ఈ అవార్డులను అందించినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఫొటో జర్నలిస్టు భరత్ భూషణ్ కుటుంబానికి డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రఖ్యాత ఫోటో జర్నలిస్టు, చిత్రకారుడు, భరత్ భూషణ్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. ఈ మేరకు భరత్ భూషణ్ కుటుంబానికి సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు మంత్రి కెటిఆర్ హైదరాబాద్‌లోని జియాగూడలో డబుల్ బెడ్‌రూమ్ ఇంటిని శనివారం కేటాయించారు. భరత్ భూషణ్ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నప్పుడు కూడా వైద్య ఖర్చుల కోసం సిఎం ఆరోగ్య నిధి నుంచి ప్రభుత్వం చేయూతనందించిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తమకు డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కేటాయించి మరోసారి అండగా నిలిచినందుకు భరత్ భూషణ్ భార్య సుభద్రమ్మ వారి కుటుంబ సభ్యులు సిఎం కెసిఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

అంగన్‌వాడీల పొర్లు దండాలు

- ఇకనైనా ప్రభుత్వం కనికరించాలని వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సమస్యలను పరిష్కరించాలని, వేతనాలు పెంచాలని సమ్మెలో ఉన్న అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు శనివారం పొర్లు దండాలు పెట్టి ప్రభుత్వానికి తమ నిరసన తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ మొర ఆలకించాలని విన్నవించారు.

రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో సిఐటియు రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు భిక్షాటన చేశారు. ఇబ్రహీంపట్నంలో పొర్లుదండాలతో ముఖ్యమంత్రికి నిరసన వ్యక్తం తెలిపారు. వికారాబాద్ జిల్లా యాలాలలో చేపట్టిన సమ్మెకు వ్యకాస జిల్లా అధ్యక్షులు బుగ్గప్ప మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగులగొట్టిన ఐసిడిఎస్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని కొండగట్టు అంజన్న ఆలయంలో అంగన్‌వాడీ ఉద్యోగులు అంజన్నకు ముడుపు కట్టి పొర్లు దండాలు పెట్టారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్ కలెక్టరేట్ల ఎదుట అంగన్‌వాడీలు పొర్లు దండాలు పెడుతూ నిరసన తెలిపారు. ఆసిఫాబాద్‌లో సిఐటియు జిల్లా అధ్యక్షుడు రాజేందర్, ఆదిలాబాద్‌లో జిల్లా అధ్యక్షుడు ఆశన్న పాల్గొన్నారు.

ఖమ్మం జిల్లా బోనకల్ మండల కేంద్రంలో అంగన్‌వాడీలకు దీక్షా శిబిరాన్ని సిఎల్‌పి నేత మల్లు భట్టి విక్రమార్క సందర్శించి సంఘీభావం తెలిపారు. ఆయనకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యకర్తల డిమాండ్లు న్యాయమైనవి అన్నారు. మధిరలో అంబేద్కర్ సెంటర్‌లో మానవహారం నిర్వహించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండల కేంద్రంలోని రామాలయంలో పొర్లు దండాలు పెట్టారు. చర్లలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు.

పొర్లు దండాలు పెడుతున్న అంగన్‌వాడీలు

నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్‌వాడీల సమ్మె కొనసాగింది. మర్రిగూడ మండలంలో వంటావార్పు నిర్వహించారు. యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలో అంగన్‌వాడీలు చెవిలో పూలు పెట్టుకొని నిరసన తెలిపారు. ఆలేరులోని సాయిబాబా గుడి వద్ద అంగన్‌వాడీలు పొర్లుదండాలు పెట్టి నిరసన తెలిపారు.

మరో మూడు రోజులు వానలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో రాగల మూడురోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. బంగాళాఖాతంలో శుక్రవారం ఏర్పడిన అల్పపీడనంగా బలపడిందని, ప్రస్తుతం వాయువ్య బంగాళాఖాతంలో కొనసాగుతుందని పేర్కొంది. దీనికి అనుబంధంగా సముద్రమట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు వ్యాపించి ఉందని తెలిపింది. వీటి కారణంగా రాగల మూడురోజుల్లో రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం పేర్కొంది. పలుచోట్ల ఉరుములు, మెరుపులతో పలు జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది.

యాదాద్రి పవర్ ప్లాంట్ అనుమతులపై కేంద్ర జాప్యం

- మంత్రి జగదీష్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యాదాద్రి థర్మల్ అల్ట్రా మెగా పవర్ ప్లాంట్‌కు కేంద్ర అనుమతుల జాప్యంపై రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఉచిత విద్యుత్ ప్రతిపక్షాలకు కంటగింపుగా మారిందని మండిపడ్డారు. మోదీ రాష్ట్రానికి ఎప్పుడు వచ్చినా మొండి చేతులే చూపిస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పర్యటనలోనైనా మోదీ యాదాద్రి విద్యుత్ ప్లాంట్‌కు అనుమతులు ఇవ్వాలని శనివారం ఆయన డిమాండ్ చేశారు. కావాలనే ఆటంకాలు సృష్టించి కేంద్రం అనుమతులు ఇవ్వడంలేదన్నారు. తొమ్మిది నెలల్లో టర్మ్ ఆఫ్ రిఫరెన్స్ ఇవ్వాలన్న ఎన్‌జిటి ఆదేశాలను కేంద్రం బేఖాతర్ చేస్తుంది. ఎన్‌జిటి ఆదేశాల ప్రకారం అనుమతులను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. నిర్మాణం పూర్తయి సిద్ధంగా ఉన్నా అనుమతులు రావడం లేదని మంత్రి జగదీశ్ రెడ్డి తెలిపారు. మోదీ జోక్యం చేసుకొని కేంద్ర మంత్రికి ఆదేశం ఇవ్వాలని రాష్ట్రంలోకి అడుగు పెట్టే ముందే ఆదేశాలు ఇచ్చి రావాలని డిమాండ్ చేశారు. మాటల్లో దేశభక్తి చూపిస్తూ.. చేతల్లో మోదీ దేశ ద్రోహం చేస్తున్నారని మండిపడ్డారు. అభివృద్ధి చెందుతున్న వారికి ప్రోత్సహం ఇవ్వకపోగా ఆటంకాలు కల్పిస్తున్నారు. రాష్ట్ర రైతాంగానికి గుండెకాయగా మారుతుందనే యాదాద్రి ప్లాంట్‌పై కుట్ర చేస్తున్నారు. పూర్తయిన ప్లాంట్‌ని ప్రజలకు అందుబాటులోకి రాకుండా ద్రోహం చేస్తున్నారు. తెలంగాణ ప్రజలు జరుగుతున్న కుట్రలను అర్థం చేసుకోవాలని మంత్రి జగదీశ్ రెడ్డి సూచించారు.

కరువు జిల్లాపై కనికరమేదీ?

- పాలమూరు -రంగారెడ్డికి దక్కని జాతీయ హోదా
- పర్యటనలు తప్ప అభివృద్ధి శూన్యం
- పడకేసిన పాలమూరు అభివృద్ధి
- నేడు మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాలకు ప్రధాని మోడీ రాక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రం ఏర్పడకముందే.. తెలంగాణ ఉద్యమ సమయంలోనే మహబూబ్‌నగర్ పట్టణంలో జరిగిన బిజెపి సభలో పాలమూరు-రంగారెడ్డి లిఫ్టుకు జాతీయ హోదా కల్పిస్తామని అప్పుడు కేంద్ర ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న సుష్మస్వరాజ్ హామీ ఇచ్చారు. ఆ తర్వాత ప్రధాని మోడీ జిల్లాకు వచ్చిన సందర్భంగా అనేక వాగ్దానాలు ఇచ్చారు. కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటు, పారిశ్రామిక అభివృద్ధితోపాటు రైల్వే సౌకర్యాల ఏర్పాటుపై దృష్టి పెడతామని చెప్పారు. ఇచ్చిన హామీల్లో ఒక్కటీ అమలు కాలేదు. కానీ, మరోసారి ప్రధాని మోడీ ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లాకు వస్తున్నారు. ఎన్నికల సమయంలో చేసే శంకుస్థాపనలకు హాజరు కావడం తప్ప.. గతంలో ఇచ్చిన హామీలను అమలు చేసే అవకాశం ఏమైనా ఉందాని జిల్లా వాసులు ప్రశ్నిస్తున్నారు. నిజామాబాద్‌లోనూ మోడీ పర్యటించనున్నారు.

కరువు కాటకాలు, వలసలకు మారుపేరుగాంచిన పాలమూరుపై కేంద్రం వివక్ష కనబరుస్తోంది. సాగునీటి ప్రాజెక్టులు లేక జిల్లా దుర్భిక్షంగా మారిన సమయంలో పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు మొదలు పెట్టారు. రాష్ట్ర విభజన సమయంలోనూ.. ఈ ప్రాజెక్టుపై బిజెపి ప్రకటన చేసింది. రాష్ట్రం ఏర్పడిన తర్వాత జాతీయ హోదా కల్పించి పనులు పూర్తి చేయిస్తామని ప్రధాని మొదలుకొని మంత్రుల దాకా ఉపన్యాసాలిచ్చారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత నేతలు జాతీయ హోదాపై ఊసే ఎత్తడం లేదు. అనేక అడ్డంకులను సైతం తొలగించే ప్రయత్నం చేయడం లేదు. జిల్లాకు మోడీ వస్తున్న సందర్భంగానైనా జాతీయ హోదాపై ప్రకటన చేయించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. జిల్లాకో నవోదయ పాఠశాల ఏర్పాటు చేసి పేదలకు నాణ్యమైన విద్య అందిస్తామని చెప్పారు. ముఖ్యంగా వనపర్తి, నారాయణపేట, నాగర్‌కర్నూల్ జిల్లాలకు రైల్వే లైను లేదు. మూడు జిల్లాల నుంచి పేదలు కర్నాటక, ముంబాయితో పాటు ఇతర దేశాలకు వలస పోతారు. రైల్వే సౌకర్యం లేక అవస్థలు పడుతున్నారు. పారిశ్రామికంగా ఎదగాలన్నా.. రైల్వే వ్యవస్థ ఉండాలి. రైల్వే లైను కోసం సర్వేలు తప్ప పనులు జరగడం లేదు. పరిశ్రమలు ఏర్పాటు చేయడం ద్వారా ఉపాధి కల్పిస్తామన్నారు. కేంద్రంలో బిజెపి అధికారం చేపట్టిన నాటి నుంచి తొమ్మిదేండ్ల కాలంలో పరిశ్రమల ఏర్పాటుపై దృష్టి పెట్టలేదు. ముఖ్యంగా పాలమూరు యూనివర్సిటీకి గ్రాంట్ ద్వారా నిధులు కేటాయించడంలోనూ వివక్ష చూపుతున్నారు.

మోడికి ఇల్లు లేదని..

ప్రధాని మోడీకి ఇల్లు లేదట అందుకని పేదలకు ఇల్లు లేకున్నా.. అంతగా పట్టించుకోవద్దని ప్రధాని బహిరంగ సభల్లో చెబుతుండటం గమనార్హం. మధ్యప్రదేశ్‌లో బహిరంగ సభలోనే పేదల సొంతింటి కల నెరవేర్చాలనే విషయంలో మోడీ 'నాకే సొంతిల్లు' లేదని దాటవేసే ధోరణిప్రదర్శించారు. కేంద్రం తీసుకొచ్చిన ప్రధానమంత్రి ఆవాజ్ యోజన పథకం ఆధ్వర్యంలో ఇప్పటి వరకు జిల్లాలో ఏ ఒక్కరికీ పక్కా ఇంటి నిర్మాణం జరగలేదు.

నాటి హామీలు ఏమయ్యాయి

ఎ. రాములు, సిపిఎం జిల్లా కార్యదర్శి, మహబూబ్‌నగర్

ఎన్నికలకు ముందు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను ముందు అమలు చేయాలి. ప్రధాని మోడీ ఏ మొఖం పెట్టుకొని జిల్లాకు వస్తున్నారు. పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు జాతీయ హోదా లేదు. కేంద్రీయ, నవోదయ పాఠశాలలకు అంకురార్పణ లేదు. రైల్వే లైనుపై దృష్టి పెట్టడం లేదు. మోడీ జిల్లాకు వస్తున్న సందర్భంగా గతంలో ఇచ్చిన హామీలను అమలు అయ్యేలా చూడాలి.

IN THE COURT OF HON'BLE XXVI ADDL. CHIEF JUDGE, CITY CIVIL COURT AT: HYDERABAD

MVOP.No.1304 OF 2023

Between:
J. Subba rao
... Claim Petitioner
AND
Gujjula Anil Kumar & 2 Others
... Respondents

To,
R-1. **Gujjula Anil Kumar** S/o Ramu Age:38 years, Occupation: Driver of the crime vehicle Bearing No TS 11UA 6949- R/o.Q.2013, Hill colony, Nagarjuna sagar, Nalgonda Dist, T.S Pin : 508202.

Sir, Whereas the above named plaintiff has filed the above said **MVOP** seeking for motor acident claim compensation against you and others in respect of injuries sustained by him. The Hon'ble court posted the matter on 19-10-2023 at 10.30.am for your appearance.

Therefore, you are hereby requested to appear before the Hon'ble XXVI addl. chief judeg court at: hyderabad, T.S. at 10.30am on 19-10-2023 either in person or through your counsel duly instructed. otherwise the matter will be heard and decided exparte in your absence.

(By order of the court)
Sd/-
(ANJAIAH KANDULA)
R. Malleshwari
Advocates
H.No. 3-1-694 Road No.6, Kakathiya colony, L.B. Nagar, Hyderabad-Ph: 9949059075

కాంగ్రెస్‌వి అలవికాని హామీలు

- కర్ణాటక, ఢిల్లీల నుంచి డబ్బుల సంచులు
- గురువు ఎన్‌టిఆర్‌ను మించనున్న శిష్యుడు కెసిఆర్
- ఖమ్మం నగర ప్రగతి నివేదన సభలో మంత్రి కెటిఆర్
- ఎన్‌టిఆర్‌తో కెసిఆర్‌ను పోల్చడంపై పలువురి విమర్శలు
- భారీ వర్షంతో భద్రాద్రి పర్యటన రద్దు
- పర్యటన నేపథ్యంలో విపక్ష నేతల నిర్బంధం

ప్రగతి నివేదన సభలో మాట్లాడుతున్న కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'గ్యారెంటీలు.. గ్యారెంటీలు అని ఊదర కొడుతున్న వాళ్లకు.. వాళ్ల సీటు గ్యారెంటీ ఉందా..? వాళ్ల పార్టీకి వారెంటీ ఉందా? ఆలోచించండి. ఆరిపోయే దీపం లాంటి పార్టీ.. డైలాగులు కొడితే మళ్లీ ఆగమవుదామా..? అభివృద్ధిలో భాగమవుదామా..? ఆలోచించండి..' అని ఐటీ, పురపాలకశాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా పర్యటనలో భాగంగా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఖమ్మం కార్పొరేషన్ ఎదుట శనివారం ఏర్పాటు చేసిన ప్రగతి నివేదన సభలో కెటిఆర్ మాట్లాడారు. అభివృద్ధి సాగాలంటే, ప్రగతి రథ చక్రాలు ముందుకు కదలాలంటే అందరి ఆశీర్వాదం కావాలన్నారు. ఆరు దశాబ్దాలు అధికారం ఇస్తే ఏమి చేయలేదు కానీ ఈరోజు ఆరు గ్యారెంటీలంటూ ఊదరగొడుతున్నారంటూ కాంగ్రెస్‌ను ఉద్దేశించి వ్యాఖ్యలు చేశారు. వారు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అమలు చేయని, అలవికాని హామీలను ఇక్కడ ఇస్తున్నారని తెలిపారు. కర్ణాటకలో స్పెషల్ ట్యాక్స్‌లు వేసి మరీ కూడబెట్టిన డబ్బులను తెలంగాణ కాంగ్రెసోళ్లకు పంపుతున్నారని ఆరోపించారు. రూ.వందల కోట్లు వచ్చినా..అమ్ముడుబోయే సంస్కృతి తెలంగాణది కాదని.. ఢిల్లీ, బెంగళూరు వాళ్లకు తెలిసేలా తీర్పు ఇవ్వాలని ప్రజలను కోరారు. డబ్బులిస్తే తీసుకోండి కానీ ఓటు మాత్రం కారు గుర్తుకు వేయాలన్నారు. నగరంలో రూ.1370 కోట్ల పనులకు శనివారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.

ఎన్‌టిఆర్‌తో కెసిఆర్‌కు పోలిక..

ఖమ్మం లకారం ట్యాంక్‌బండ్ వద్ద ఎన్‌టిఆర్ పార్కుతోపాటు కాంస్య విగ్రహాన్ని కెటిఆర్ ప్రారంభించారు. ఎన్‌టిఆర్‌తో కెసిఆర్‌కు పోలిక పెడుతూ.. ఎన్‌టిఆర్ శతజయంతి ఉత్సవం నేపథ్యంలో విగ్రహాన్ని ప్రారంభించామన్నారు. విశ్వవిఖ్యాత నట సార్వభౌమ నందమూరి తారక రామారావు అందర్నీ ఆదరించి.. పేదలను గుండెలో పెట్టుకున్నారన్నారు. చరిత్ర రాసినప్పుడు కొన్ని వాస్తవాలను మరుగున పడవేయలేమన్నారు. తెలుగు వారు ఉన్నారని దేశమంతా మనవైపు చూసేటట్టు చేసింది ఎన్‌టిఆర్ అని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారందరికీ ఎంతో ఆప్తుడు ఎన్‌టిఆర్ అని, ప్రజల మనస్సుల్లో చెరగని ముద్ర వేసిన మహానుభావుడని కొనియాడారు. గురువు ఎన్‌టి రామారావు చేయలేని పని, వారి శిష్యుడు కెసిఆర్‌కు అవకాశం ఉందన్నారు. దక్షిణ భారతదేశంలోనే ఏ ముఖ్యమంత్రి, ఎన్‌టిఆర్ కూడా హ్యాట్రిక్ సిఎం కాలేదని తెలిపారు. కానీ 'గురువును మించిన శిష్యుడిగా కెసిఆర్ హ్యాట్రిక్ సీఎం అవుతారని' జోస్యం చెప్పారు. దాంతో ఎన్‌టిఆర్ ఆత్మ కూడా శాంతిస్తుందన్నారు. ఈ పర్యటనలో రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, బిఆర్‌ఎస్ లోక్‌సభా పక్షనేత నామ నాగేశ్వరరావు, రాజ్యసభ ఎంపిలు బండి పార్థసారథిరెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్, మేయర్ పునుకొల్లు నీరజ, జడ్పీ, డిసిసిబి, విత్తనాభివృద్ధి సంస్థ, సుడా, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్‌లు లింగాల కమలరాజ్, కూరాకుల నాగభూషణం, కొండబాల కోటేశ్వరరావు, బచ్చు విజయ్‌కుమార్, వైరా బిఆర్‌ఎస్ అభ్యర్థి బాణోత్ మదన్‌లాల్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే వెంకట వీరయ్య ఆధ్వర్యంలో సత్తుపల్లిలో సభ నిర్వహించారు.

ఎన్‌టిఆర్ అభిమానుల ఆగ్రహం

ఎన్‌టిఆర్‌కు కెసిఆర్‌కు పోలిక పెట్టడం.. గురువును మించిన శిష్యుడు అంటూ కెటిఆర్ చేసిన వ్యాఖ్యలపై ఎన్‌టిఆర్ అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్‌టిఆర్ విగ్రహాన్ని కెటిఆర్ ప్రారంభించడంతో రామారావు ఆత్మ శాంతించడం కాదు క్షోభిస్తుందని ఎద్దేవా చేశారు. ఎన్‌టిఆర్ అభిమాన సంఘాల ఆధ్వర్యంలో కెటిఆర్ ప్రారంభించిన విగ్రహాన్ని ఆదివారం పసుపునీళ్లతో శుద్ధి చేయనున్నట్టు ప్రకటించారు. ఎన్‌టిఆర్ విగ్రహం ప్రారంభ సందర్భంగా ఆయన ముఖంపై ముసుగు తొలగకపోవడంతో ఆ తర్వాత హైడ్రాలిక్ మిషన్ సహాయంతో తీశారు. తిరుగు పయనంలో కెటిఆర్ మళ్లీ ఆ విగ్రహం దగ్గరకు వచ్చి నాయకులతో కలిసి ఫొటోలకు ఫోజులిచ్చారు.

తుమ్మల, పొంగులేటిపై పరోక్ష విమర్శలు

కొణిజర్ల మండలం అంజనాపురంలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ శంకుస్థాపన సభలో కెటిఆర్ మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై పరోక్ష విమర్శలు చేశారు. కెసిఆర్ పదవి ఇస్తే మంచోడు, ఇవ్వకుంటే చెడ్డోడని, పదవుల కోసం పార్టీలు మారే నాయకులు స్వార్థ రాజకీయాలు చేస్తున్నారన్నారు. 50 ఏండ్లుగా తెలంగాణకు అన్యాయం చేసిన కాంగ్రెస్‌కు అవకాశం ఇవ్వొద్దన్నారు.

విపక్ష నేతల అరెస్ట్

కెటిఆర్ పర్యటనను అడ్డుకుంటామని ముందుగానే కాంగ్రెస్ నేతలు ప్రకటించడంతో వారిని పోలీసులు అరెస్టు చేశారు. వీరితో పాటు సిపిఎం నేతలు, వామపక్ష విద్యార్థి సంఘ నాయకులను అరెస్టు చేశారు. అయితే బిజెపి నాయకులను మాత్రం నిర్బంధించకపోవడం చర్చనీయాంశమైంది. మిక్కిలినేని నరేంద్ర, కాంగ్రెస్ కార్పొరేటర్లు మిక్కిలినేని మంజుల, సైదులు, చోటాబాబా, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భూక్యా వీరభద్రం, బి.రాంబాబు, ఎస్.నవీన్‌రెడ్డి, తాళ్లపల్లి కృష్ణ, షేక్ బషీరుద్దీన్, టిడిపి నుంచి నల్లమల రంజిత్, శ్రీనివాసరావు, చేతుల నాగేశ్వరరావును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇదిలావుండగా భారీ వర్షం కారణంగా కెటిఆర్ భద్రాచలం పర్యటన రద్దయింది.

కవితకు బ్రిడ్జ్ ఇండియా సంస్థ ఆహ్వానం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యంపై లండన్‌లో ఏర్పాటు చేయబోయే సమావేశంలో కీలకోపన్యాసం చేయాలసిందిగా పబ్లిక్ పాలసీకి సంబంధించిన ప్రముఖ స్వచ్ఛంద సంస్థ బ్రిడ్జ్ ఇండియా (లండన్) బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఆహ్వానించింది. పార్లమెంటు ఆమోదించిన మహిళ రిజర్వేషన్ల బిల్లులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేసిన సందర్భంగా లండన్‌లో అక్టోబర్ 6న ఒక సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నామని ఆహ్వాన పత్రంలో పేర్కొంది. రాజకీయాల్లో, ప్రజాస్వామ్య ప్రక్రియలో మహిళల భాగస్వామ్యం పెరగడానికి కవిత విశేషంగా కృషి చేశారని ఆ సంస్థ ప్రశంసించింది. మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం అనేక ఆందోళనా కార్యక్రమాలను చేపట్టారనీ, వివిధ రాజకీయ పార్టీల మద్దతును కూడగట్టడంలో కీలక పాత్ర పోషించారని వివరించింది. ఇలా పలు రకాల కార్యక్రమాల ద్వారా దేశవ్యాప్తంగా మహిళా బిల్లుపై చర్చను రేకెత్తించారని పేర్కొంది. జంతర్ మంతర్‌లో దాదాపు 6000 మందితో ధర్నా నిర్వహించారని, ఈ ధర్నా కార్యక్రమానికి 18 పార్టీల నేతలు హాజరైన మద్దతు ప్రకటించారని తెలిపింది. మహిళా రిజర్వేషన్ల ఆవశ్యకతపై ఢిల్లీలో భారత్ జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో 13 రాజకీయ పార్టీలతో పాటు మహిళా, విద్యార్థి, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారని గుర్తు చేసింది.

మహిళారక్షిత సమాజం నిర్మిద్దాం

- రాష్ట్రంలో తగ్గిన మాతా శిశుమరణాలు
- స్త్రీ, శిశుసంక్షేమానికి ప్రభుత్వం కృషి : సునీతా లక్ష్మారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహిళారక్షిత సమాజం నిర్మిద్దామని, మహిళలకు అండగా నిలుద్దామని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. పోషకాహార లోపాన్ని నివారించి, ఆరోగ్య సమాజాన్ని నిర్మిద్దామని పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా చిలుకూరులోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా ప్రాంగణంలో రాష్ట్ర మహిళా కమిషన్ ఆధ్వర్యంలో శనివారం 'పోషణ మహా' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సునీతాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, పిల్లలు పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యవంతులుగా ఉండాలని చెప్పారు. అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఎఎన్‌ఎంలతో పోషణ పంచాయతీ కమిటీల సమావేశం ఏర్పాటు చేసి పోషణ లోపం, ఆరోగ్యంపై అవగాహనా సదస్సులు ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో న్యూట్రీగార్డెన్స్ ఏర్పాటు చేశారని తెలిపారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తిగా నిలిచాయన్నారు. ఆదివాసీ, గిరిజన మహిళలు, చిన్నారుల్లో పౌష్టికాహార లోపాన్ని శాశ్వతంగా దూరం చేసేందుకు తెలంగాణ సర్కారు 'గిరి పోషణ' కార్యక్రమాన్ని అమలు చేసిందన్నారు. మహిళలకు సమస్యలు ఎదురైనప్పుడు వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు కానీ మహిళా హెల్ప్‌లైన్ నంబర్ 181 లేదా తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ వాట్సప్ హెల్ప్‌లైన్ నంబర్ 9490555533కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మహిళా కమిషన్ సభ్యులు షాహీన్ అఫ్రోజ్, కుమ్ర ఈశ్వరి భాయ్, కటారి రేవతిరావు, గద్దల పద్మ, సుధాం లక్ష్మి, కటారి రేవతిరావు, డైరెక్టర్ శారద, సెక్రెటరీ కృష్ణకుమారి, డిఆర్‌డిఒ ప్రభాకర్, సిడిపిఒ సృజన తదితరులు పాల్గొన్నారు.

మహిళా హక్కులకు భద్రత కల్పించాలి

- అక్టోబర్ 5న చలో ఢిల్లీ
- ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు అరుణ జ్యోతి

జీపు జాతాను ప్రారంభిస్తున్న అరుణ జ్యోతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహిళల హక్కుల రక్షణ, ప్రజాస్వామ్య పరిరక్షణ భద్రత కల్పించాలని ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు అరుణ జ్యోతి అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఐద్వా చేపట్టిన జీపుజాతాను శనివారం యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి పట్టణ కేంద్రంలో జెండా ఊపి ప్రారంభించారు. జీపు జాతా భువనగిరి, ఆలేరు, వలిగొండ, రామన్నపేట, పోచంపల్లి, చౌట్టుప్పల్, నారాయణపురం మండలం, చిన్నకోండురు గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన సభలో అరుణజ్యోతి మాట్లాడుతూ.. 2014లో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిత్యావసర సరుకుల ధరలు 200 శాతం పెరిగాయన్నారు. గ్యాస్ ధర రూ.410 నుంచి రూ.1270 చేరుకుందన్నారు. ఎన్నికల నేపథ్యంలో కంటి తుడుపు చర్యగా కొద్దిపాటి ధర తగ్గించి ఎంతో చేశామని గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. ప్రజలకు సబ్సిడీలతో సేవలు అందిస్తున్న బ్యాంకులు బిఎస్‌ఎన్‌ఎల్, ఒఎన్‌జిసి, రైల్వేలు, పోర్టులు, సింగరేణి, విశాఖ ఉక్కు మొదలగు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరణ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మనువాద భావజాలాన్ని అమలు చేయాలని ఆర్‌ఎస్‌ఎస్ అడుగుజాడల్లో బిజెపి ప్రభుత్వాన్ని నడిపిస్తోందని విమర్శించారు. మహిళలకు రక్షణ లేని పరిస్థితులు దాపురిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దాడులకు గురైన వారిని పట్టించుకోకుండా దోషులను రక్షిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హనుమకొండలో తొమ్మిది నెలల పసిపాప, హైదరాబాదులో ఆరు సంవత్సరాల బాలిక చైత్రను, 60 సంవత్సరాల వృద్ధురాలు, బొమ్మలరామారం మండలం హాజీపూర్ గ్రామంలో విద్యార్థినులు ఏ రకమైన వస్త్రధారణ ధరించి పురుషులను రెచ్చగొట్టారో చెప్పాలని డిమాండ్ చేశారు. దేశ భద్రత, మహిళల భద్రత కోసం మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యం దేశవ్యాప్తంగా ప్రజలను చైతన్యం చేసేందుకు ఐద్వా ఆధ్వర్యంలో జీపు జాతాలు, పాదయాత్రలు చేపట్టినట్టు చెప్పారు. అక్టోబర్ 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. చట్ట సభల్లో వేంటనే 33 శాతం మహిళా రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఐద్వా భువనగిరి జిల్లా కార్యదర్శి బట్టుపల్లి అనురాధ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ కూడా అధికారంలోకి రాకముందు పేదలందరికీ ఇల్లు కట్టిస్తామని హామీనిచ్చి విస్మరించాయన్నారు. అర్హులైన పేదలందరికీ 125 గజాల ప్రభుత్వ స్థలం ఇచ్చి.. ఇంటి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం ఐదు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రేషన్ షాపుల ద్వారా తమిళనాడు, కేరళ రాష్ట్రాలు ఇస్తున్నట్టుగా 14 రకాల నిత్యావసర సరుకులు సబ్సిడీ ధరకి ఇవ్వాలని కోరారు. ఈ జీపు జాతాలో ఐద్వా జిల్లా అధ్యక్షులు అవ్వారు రామేశ్వరి, జిల్లా సహాయ కార్యదర్శి దోనూరు నిర్మల, పాల్గొన్నారు

ఎస్‌బిఐ 'వెల్త్ హబ్' ప్రారంభం

హైదరాబాద్ : దేశంలోనే అతిపెద్ద విత్త సంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) సికింద్రాబాద్‌లో మేనేజ్‌మెంట్ సర్వీసెస్‌కు సంబంధించిన వెల్త్ హబ్‌ను ఏర్పాటు చేసింది. శనివారం దీనిని హైదరాబాద్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్ కుమార్, ఎస్‌బిఐ కార్పోరేట్ సెంటర్ ముంబయి సిజిఎం (వెల్త్ అండ్ ప్రీమియర్ బ్యాంకింగ్) సుఖిందర్ కౌర్ లాంచనంగా ప్రారంభించారు. దేశంలో ఎస్‌బిఐ వెల్త్ ప్రస్తుతం 102 ప్రధాన నగరాల్లో 232 వెల్త్ హబ్స్‌ను కలిగి ఉంది. అధిక ఆదాయం కలిగిన 3,75,000 క్లయింట్లకు సర్వీసును అందిస్తుంది. దాదాపు రూ.3 లక్షల కోట్ల ఎయుఎంను కలిగి ఉంది. 2024 మార్చి ముగింపు నాటికి 4.50 లక్షల క్లయింట్లతో రూ.4 లక్షల ఎయుఎంకు చేరాలని లక్ష్యంగా పెట్టుకుందని రాజేష్ కుమార్ అన్నారు. హైదరాబాద్‌లో ఇది తమకు 12 హెల్త్ హబ్ అని తెలిపారు. అధిక ఆదాయాలు కలిగిన క్లయింట్లకు ప్రత్యేక సర్వీసులను అందించడమే వీటి లక్ష్యమని పేర్కొన్నారు. ప్రముఖ ఫండ్ సంస్థల నుంచి అధిక ఆదాయాలు కలిగిన వారికి అన్ని కేటగిరీల్లో ఆకర్షణీయ ప్రొడక్ట్స్‌ను అందిస్తున్నామన్నారు. ఎన్‌ఆర్‌ఐల కోసం కొచ్చిలోనూ గ్లోబల్ ఇ-వెల్త్ సెంటర్‌ను ప్రారంభించినట్లు ఎస్‌బిఐ తెలిపింది.

పబ్లిక్ ఇష్యూకు అజాద్ ఇంజినీరింగ్

- సెబీకి దరఖాస్తు

హైదరాబాద్ : ఆజాద్ ఇంజనీరింగ్ లిమిటెడ్ ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ)కు రానుంది. హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తోన్న ఈ సంస్థ మార్కెట్ రెగ్యులేటర్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్చేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ)కి దరఖాస్తు చేసుకుంది. దీనికి సంబంధించిన ప్రతిపాదిత విధాన పత్రాలను సమర్పించింది. ఈ ఇష్యూలో రూ.740 కోట్ల నిధులు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో ఆఫర్ ఫర్ సేల్ ద్వారా రూ.240 కోట్లు, ప్రమోటర్ల వాటాలను విక్రయించడం ద్వారా మరో రూ.500 కోట్ల నిధులు పొందాలని నిర్దేశించుకుంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.2,517 కోట్ల రెవెన్యూ నమోదు చేసింది. ప్రతీ ఏడాది సగటున 27 శాతం వృద్ధిని సాధిస్తోంది. ఈ ఇష్యూకు యాక్సిస్ కాపిటల్, ఐసిఐసిఐ సెక్యూరిటీస్, ఎస్‌బిఐ కాపిటల్ మార్కెట్స్, ఆనంద్ రతి సంస్థలు లీడ్ మేనేజర్స్‌గా వ్యవహారించనున్నాయి.

ప్రజల కోసం పనిచేస్తా

గవర్నర్ తమిళిసై

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎలాంటి అవమానాలు పట్టించుకోను.. ప్రజల కోసం పనిచేస్తా అని రాష్ట్ర గవర్నర్ తమిళి సై అన్నారు. ఒకప్పుడు బిజెపి నేతను.. ఇప్పుడు గవర్నర్‌ను. రాజకీయాలపై ఇష్టం వల్లే వైద్య వృత్తికి దూరంగా ఉన్నానని చెప్పారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై రాష్ట్రపతి సంతకం చేయడం ఆనందంగా ఉందని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై రాజ్‌భవన్‌లో గవర్నర్ శనివారం కృతజ్ఞత సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తమకు 33 శాతం రిజర్వేషన్ కల్పించిన ప్రధాని మోదీకి ఆమె ధన్యవాదాలు తెలిపారు. గవర్నర్ మాట్లాడుతూ "రాజకీయాల్లో పురుషాధిక్యత ఎక్కువ. నేను గవర్నర్‌గా వచ్చినప్పుడు ఒక్క మహిళా మంత్రి కూడా లేరు. గవర్నర్‌గా వచ్చే నాటికి ఇద్దరు మహిళలు మంత్రులు అయ్యారు. నాపై పువ్వులు వేసే వారు ఉన్నారు.. రాళ్లు వేసే వారున్నారు. నాపై రాళ్లు వేస్తే.. వాటితో భవంతి కడతా. నాపై పిన్స్ వేస్తే.. ఆ పిన్స్ గుచ్చుకుని వచ్చే రక్తంతో నా చరిత్ర బుక్ రాసుకుంటా. అందరూ అందరికీ నచ్చాలని లేదు. నాపై పువ్వులు వేసినా.. రాళ్లు వేసినా ఆహ్వానిస్తా" అని గవర్నర్ పేర్కొన్నారు.

డ్రెయినేజీలో పడి మహిళా హెడ్ కానిస్టేబుల్ మృతి

- కెటిఆర్ బందోబస్తులో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విధుల్లో ఉన్న మహిళా హెడ్‌కానిస్టేబుల్ ప్రమాదవశాత్తు డ్రెయినేజీ కాలువలో పడి మృతిచెందారు. ఈ ఘటన శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి..

భద్రాచలంలో మంత్రి కెటిఆర్ పర్యటన నేపథ్యంలో బందోబస్తు నిమిత్తం కొత్తగూడెం వన్‌టౌన్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ శ్రీదేవి భద్రాచలం వచ్చారు. అయితే, భారీ వర్షం వల్ల రోడ్లంతా నీటితో నిండి డ్రెయినేజీ కూడా కనిపించకుండా పారుతోంది. ఆ సమయంలో రామాలయం వద్ద వాహనాలు పార్కింగ్ చేసే స్థలం వద్ద నుంచి అన్నదాన సత్రం వైపు శ్రీదేవి నడుచుకుంటూ వెళ్తుండగా ప్రమాదవశాత్తు మురుగు కాలువలో పడిపోయారు. గమనించిన స్థానికులు వెంటనే ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బందికి సమాచారం అందించారు. ఎన్‌డిఆర్‌ఎఫ్, పోలీస్, రెవెన్యూ, పంచాయతీ శాఖల సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టగా శ్రీదేవి మృతదేహం కరకట్ట వద్ద స్లూయిజ్‌లో లభ్యమయింది. దీంతో పోలీస్ శాఖలో తీవ్ర విషాదం నెలకొంది. శ్రీదేవి మృతదేహాన్ని చూసి తోటి మహిళా ఉద్యోగులు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ ఘటనపై ఎఎస్‌పి కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో మృతదేహాన్ని ఎంపి మాలోత్ కవిత, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు సందర్శించి నివాళి అర్పించారు.

నెక్స్ట్ ఐఎఎస్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్

హైదరాబాద్ : ఐఎఎస్, ఐపిఎస్ ప్రవేశ పరీక్షలకు పోటీపడే విద్యార్థులకు ప్రత్యేక స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్‌ను అందిస్తున్నట్లు మేడ్ ఈజీ గ్రూప్‌నకు చెందిన నెక్స్ట్ ఐఎఎస్ అకాడమీ పేర్కొంది. ఔత్సాహికులు తమ కలల సాధన కోసం మద్దతును అందిస్తున్నట్లు తెలిపింది. ఈ ప్రోగ్రాం జనరల్ స్టడీస్‌లో మెయిన్స్ ఫౌండేషన్ కోర్సు కోసం ట్యూషన్ ఫీజులో 100 శాతం వరకు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నట్లు పేర్కొంది. ఈ స్కాలర్‌షిప్ పరీక్ష కోసం అక్టోబర్ 5న రిజిస్ట్రేషన్‌కు ఆఖరు తేదీగా, స్కాలర్‌షిప్ పరీక్ష తేదీని 15న నిర్వహిస్తున్నట్లు తెలిపింది. విజయవంతమైన అభ్యర్థులు తమ శిక్షణను 2023 అక్టోబర్ 26 నుండి 2024 జూలై వరకు పొందుతారని పేర్కొంది.

అసెంబ్లీని సందర్శించిన కేరళ మంత్రి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేరళ రాష్ట్ర పోర్ట్స్ ,మ్యూజియమ్స్, అర్కియాలజీ శాఖల మంత్రి అహ్మద్ దేవర కోవిల్ రాష్ట్ర శాసనసభ, మండలిని సందర్శించారు. శనివారం అసెంబ్లీకి విచ్చేసిన ఆయనకు రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువ కప్పి, చార్మినార్ మెమెంటో అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా సమావేశాలు జరిగే తీరు, నియమ, నిబంధనలను వివరించారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను గురించి గుత్తా వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ లెజిస్లేచర్ సెక్రెటరీ నరసింహా చార్యులు తదితరులు పాల్గొన్నారు.

టిసిఎస్‌లో ఇంటి నుంచి పనికి స్వస్తి..!

న్యూఢిల్లీ : కరోనా సమయం నుంచి ఇంటి నుంచి పని చేస్తున్న ఉద్యోగులు ఇకపై ఆఫీసుకు రావాల్సిందేనని ఐటి కంపెనీలు వరుసగా ఆదేశాలు జారీ చేస్తున్నాయి. తాజాగా దేశంలోనే అతిపెద్ద ఐటి కంపెనీ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) ఇంటి నుంచి పని విధానం (వర్క్ ఫ్రం హోం)కు స్వస్తి పలకాలని నిర్ణయించింది. అక్టోబర్ 1 నుంచి వారంలో ఐదు రోజులు కచ్చితంగా కార్యాలయాలకు వచ్చి పని చేయాల్సిందేనని ఉద్యోగులకు మెయిల్స్ ద్వారా సమాచారం ఇచ్చినట్లు రిపోర్టులు వస్తున్నాయి. కరోనా తగ్గుముఖం పట్టినప్పటి నుంచి హైబ్రిడ్ వర్క్ పద్ధతికి అనుమతించింది. దీంతో వారంలో సగం రోజులు కార్యాలయాలకు వచ్చి.. మిగితా రోజులు ఇంటి నుంచి పని చేస్తున్నారు. ఇకపై ఆ మిగిలిన రెండు రోజులు కూడా ఆఫీసుకు రావాల్సిందేనని టిసిఎస్ సిఇఒ, చీఫ్ హ్యూమన్ రిసోర్సెస్ ఆఫీసర్ పేరిట ఉద్యోగులకు ఆదేశాలు వెళ్లాయని తెలిసింది.

మోడీ క్షమాపణ చెప్పి రాష్ట్రంలో అడుగు పెట్టాలి

- మంత్రి శ్రీనివాస్ గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వెనుకబడిన ప్రాంతానికి సాగు, తాగునీరు అందించే పాలమూరు -రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా ఇస్తామని మూడుసార్లు హామీ ఇచ్చి ప్రధాని నరేంద్ర మోడీ మాట తప్పారని మంత్రి డాక్టర్ వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. తన కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేసిన ప్రధాని మోడీ ఏ మొఖం పెట్టుకొని అక్టోబర్ 1న మహబూబ్‌నగర్ జిల్లా పర్యటనకు వస్తున్నారని ప్రశ్నించారు. ఈ ప్రాంత ప్రజలకు క్షమాపణ చెప్పిన తర్వాతే ఈ గడ్డపై అడుగు పెట్టాలని డిమాండ్ చేశారు. ఏ చిన్న అవకాశం దొరికినా తెలంగాణపై విషం చిమ్మే ప్రధానికి పాలమూరుపై పాదం మోపే అర్హత లేదన్నారు. ఇప్పుడు ప్రధాని పాల్గొంటున్న బహిరంగ సభ వేదికపైనే గతంలో పాలమూరు- ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇస్తామని చెప్పారని గుర్తు చేశారు. కులం, మతం పేరిట ప్రజలను రెచ్చగొట్టడం ద్వారా ప్రశాంతంగా ఉన్న పాలమూరును అల్లకల్లోలం చేసేందుకు వస్తున్నారా అని ప్రశ్నించారు. పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా అడిగిన సందర్భంలో ఇకపై ఏ ప్రాజెక్టుకూ ఇవ్వబోమని పార్లమెంటు సాక్షిగా చెప్పిన బిజెపి సర్కారు.. తెలంగాణకు ఎగువన ఉన్న కర్ణాటకలోని అప్పర్ భద్ర ప్రాజెక్టుకు మాత్రం జాతీయ హోదా ఇచ్చిందని చెప్పారు. తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి పెండింగ్‌లో ఉన్న కృష్ణా జలాల పంపిణీ విషయం త్వరగా తేల్చాలని డిమాండ్ చేశారు.

నిరసన తెలుపుతున్న తండావాసులు

'గృహలక్ష్మి'లో అవకతవకలపై రాస్తారోకో

- బిఆర్‌ఎస్ నేతలనే ఎంపిక చేస్తున్నారని
- తండావాసుల ఆగ్రహం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సూర్యాపేట జిల్లా ఆత్మకూర్‌ఎస్ మండలంలోని కొత్తతండాలో గృహలక్ష్మి పథకం అమలులో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ గ్రామస్తులు సూర్యాపేట-దంతాలపల్లి రహదారిపై శనివారం రాస్తారోకో చేశారు. రోడ్డుపై అడ్డంగా కట్టెలు వేశారు. ఈ సందర్భంగా కొత్త తండా మహిళలు మాట్లాడుతూ.. అర్హులకు గృహలక్ష్మి పథకం వర్తింపజేయకుండా అనర్హులైన అధికార పార్టీ నాయకులను ఎంపిక చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇళ్లు, వ్యవసాయ భూములు ఉండి బిఆర్‌ఎస్‌లో పనిచేస్తున్న వారినే ఎంపిక చేయడం ఏంటని ప్రశ్నించారు. అద్దె ఇంట్లో ఉంటూ కూలీ పనులు చేస్తున్న పేదలను ఎంపిక చేయకపోవడం దారుణమన్నారు. పోలీసులు తండావాసులకు సర్దిచెప్పడంతో ఆందోళన విరమించారు. అదేవిధంగా పాతర్లపహాడ్ ఎక్స్‌రోడ్డు వద్ద బిజెపి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

పెరిగిన మెస్ ఛార్జీలను అమలు చేయాలి

- సంక్షేమ హాస్టళ్లపై చిత్తశుద్ధి లేని సర్కార్
- ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్‌ఎల్.మూర్తి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంక్షేమ హాస్టళ్లలో పెంచిన మెస్ ఛార్జీలను వెంటనే అమలు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్‌ఎల్.మూర్తి అన్నారు. 'విద్యారంగం ఎదుర్కొంటున్న సవాళ్లు' అనే అంశంపై జనగామ జిల్లా జఫర్‌గడ్ మండల కేంద్రంలో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌ఎల్.మూర్తి మాట్లాడుతూ.. దేశంలో అందరికీ విద్య అందించాలని రాజ్యాంగం చెప్తుంది కానీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చదువుకున్న వారికి ఉద్యోగాలు కల్పించకుండా నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నాయన్నారు. అంబేద్కర్ లాంటి మహానుభావులను ఆదర్శం చేసుకొని చదవాలని విద్యార్థులకు సూచించారు. సంక్షేమ హాస్టల్లో పేద మధ్యతరగతి విద్యార్థుల చదువుతున్నారన్నారు. కనీసం వాళ్లకు పౌష్టిక ఆహారం పెట్టాలన్న సోయి ప్రభుత్వానికి లేదని విమర్శించారు. సంక్షేమ వసతి గృహాలకు సొంత భవనాలు లేక.. అద్దె భవనాల్లో అరకొర వసతుల మధ్య విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఎన్నికలపై ఉన్న శ్రద్ధ విద్యార్థుల భవిష్యత్‌పై ఎందుకు లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా మంత్రులు, విద్యా శాఖ అధికారులు స్పందించి సంక్షేమ హాస్టళ్లను సందర్శించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే భవిష్యత్‌లో పెద్దఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. విద్యాశాఖ మంత్రి ఇంటిని ముట్టడిస్తామన్నారు. పెంచిన మెస్ చార్జీలకు సంబంధించి వెంటనే జీవోలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.5,177 కోట్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సందీప్, ధర్మభిక్షం, జిల్లా సహాయ కార్యదర్శి యకన్న రాథోడ్, మండల కార్యదర్శి అర్జున్, ఉస్మానియా యూనివర్సిటీ రీసెర్చ్ విద్యార్థి ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో 'మోత మోగిద్దాం'

చంద్రబాబుకు మద్దతు ప్రకటించిన టిడిపి అభిమానులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డప్పు కొడుతున్న మోత్కుపల్లి నరసింహులు

టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్టుకు వ్యతిరేకంగా టిడిపి చేపట్టిన 'మోత మోగిద్దాం' కార్యక్రమానికి హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని పలు ప్రాంతాల్లో ప్రజలు స్పందించారు. టిడిపి పార్టీ కార్యకర్తలు, శ్రేణులు, అభిమానులు, ప్రజలు వివిధ రకాలుగా శబ్దాలు చేసి చంద్రబాబుకు మద్దతు ప్రకటించారు. శనివారం రాత్రి 7గంటల నుంచి రాత్రి 7.05 గంటల వరకు ఐదు నిమిషాల పాటు మోత మోగించారు.

బేగంపేటలో మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు ఆధ్వర్యంలో మోత మోగిద్దాం కార్యక్రమాన్ని చేపట్టారు. ఆయన నివాసం వద్ద డప్పు కొట్టి నిరసన వ్యక్తం చేశారు. మియపూర్‌లోని ఎస్ఆర్ ఎస్టేట్స్‌లో చంద్రబాబు అభిమానులు మోత మోగించారు. తెలంగాణ కమ్మ సంఘం రాష్ట్ర అధ్యక్షులు మువ్వ సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పెద్ద ఎత్తున చంద్రబాబు అభిమానులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని చంద్రబాబు అరెస్టుకు నిరసనగా శబ్దాలు చేశారు. ప్రతి ఒక్కరూ నడుస్తూ విజిల్స్ వేస్తూ, కొందరు బైకులపై హారన్ మోగిస్తూ మద్దతు తెలిపారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని మోతీనగర్, రాజీవ్ నగర్, కల్యాణ్‌నగర్ కాలనీవాసులు డప్పు కొట్టి నిరసన వ్యక్తం చేశారు. కొవ్వొత్తులతో మౌన ప్రదర్శన నిర్వహించారు. శాంతియుతంగా సుమారుగా 1000 మందికి పైగా మహిళలు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. కూకట్‌పల్లి లోని సర్దార్ పటేల్ నగర్, రమ్యా గ్రౌండ్, హెచ్‌ఎంటి హిల్స్‌లోనూ మోత మోగించారు. ఖమ్మం, భద్రాచలం, అశ్వారావుపేట, మల్కాజ్‌గిరి, నిజామాబాద్ ప్రాంతాల్లో కూడా టిడిపి అభిమానులు మోత మోగించారు.